క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

జూలపల్లి, మే 26 : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కొనియాడారు. జూలపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం రాత్రి ఎమ్మెల్యే ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. టోర్నమెంట్ నిర్వాహకులు, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు దారబోయిన నరసింహం తన తండ్రి దారబోయిన లింగయ్యయాదవ్ స్మారకార్థం తన సోదరుడు ప్రవాస భారతీయుడు దారబోయిన మధుకర్‌తో కలిసి పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయరమణారావు క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. వాలీబాల్‌కు జూలపల్లి పుట్టినిల్లనీ, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎంతో మంది క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపి గ్రామానికి వన్నె తెచ్చారని పేర్కొన్నారు. చాలా మంది క్రీడాకారులు ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాల్లో స్థిరపడి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు విద్యను విస్మరించకుండా పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం క్రీడలపై ఆసక్తి పెంచేలా ప్రేరేపించాలని సూచించారు. ఇక్కడ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, జడ్పీటీసీలు బొద్దుల లక్ష్మణ్, ప్రకాశ్‌రావు, ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండలాధ్యక్షుడు దండె వెంకటేశం, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, జిల్లా సంయుక్త కార్యదర్శి దామెర కమలాకర్ రెడ్డి, నాయకులు బంటు ఎల్లయ్య, మాంకాలి తిరుపతి, కుంటూరి రాజయ్య, సొల్లు శ్యామ్, తొంటి బుచ్చయ్య, కొప్పుల మహేశ్, తాడ్వాయి రాంగోపాల్‌రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, సామ రాజేశ్వర్‌రెడ్డి, అంతటి అన్నయ్యగౌడ్, సాయిరి మహేందర్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు పురమాని సాంబరెడ్డి, భూసారపు రవీందర్‌రగౌడ్, అమరగాని గంగాధర్, అమరగాని వెంకటేశ్, ఖాజామియా, బొమ్మన వేని సతీశ్ పాల్గొన్నారు.

బోనాలతో ర్యాలీ తీస్తున్న మహిళలు, భక్తులు

వైభవంగా పోచమ్మ బోనాలు

ఓదెల, మే 26: ఓదెల గ్రామంలో గౌడ కులస్తులు పోచమ్మ బోనాలను జరుపుకున్నారు. ఇక్కడ రెండు రోజులుగా గౌడ కులస్తులు రేణుకా ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం పోచమ్మ బోనాలను చేశారు. గ్రామంలో గౌడ సంఘం మహిళలు ఇంటికో బోనంతో పోచమ్మ ఆలయం వరకు డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, నృత్యాలతో తరలివెళ్లారు. గౌడ కులస్తులకు గ్రామంలో ఇతర కుల సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. గౌడ సంఘ నాయకులు పచ్చిమట్ల శ్రీనివాస్, అయిలు స్వామి ఆధ్వర్యంలో బోనాల జాతర జరగగా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

పెద్దపల్లి, మే26: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ పెద్దపల్లి ఏడీఈ మాటేటి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగర్ రోడ్, తిలక్‌నగర్, పైడ బజారు, కోరి కాంప్లెక్స్, జెండా చౌరస్తా, శంకర్ గంజీ, కుమ్మరి వాడలో సోమవారం ఉదయం 8నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

LOST

★Thipparam Rajashekar, S/o. Chandrachari, H.No. 8-2-114, Gandhnagar Sircilla Town & Mandal Rajanna Sircilla Dist. My Pass Port No. L8218922 Lost going by Bike from House to Bus Stand any One Find call Me: 9553159151

NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

గ్రంథాలయంలో విత్తన బస్తాలు

- రూ. 25 లక్షల నిధులు మంజూరు చేసిన బీఆర్ఎస్ సర్కార్
- ఐదేండ్లక్రితం శంకుస్థాపన
- నిధులున్నా మొదలు పెట్టని పనులు
- అప్పట్లో పనులు అడ్డుకున్న బీజేపీ నాయకుడు
- ఒకే భవనంలో మూడు కార్యాలయాలు..
- సొంత భవనం లేక పాఠకుల ఇబ్బందులు
- ఏండ్ల తరబడి అద్దె భవనంలోనే..

జూలపల్లి గ్రంథాలయంలోని రీడింగ్ రూమ్‌లో నిల్వ చేసిన విత్తన బస్తాలు

జూలపల్లి, మే 26 : జూలపల్లి మండల కేంద్రంలోని గ్రంథాలయం ఏండ్ల తరబడి అద్దె భవనానికే పరిమితమైంది. సొంత భవనం లేక పాఠకులు ప్రతి నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ భవనంలో వసతులు లేక విద్యార్థులు, నిరుద్యోగ యువతీ, యువకులు అవస్థలు పడుతున్నారు. జూలపల్లి, అబ్బాపూర్, కొత్తూరు, కోనరావుపేట, కుమ్మరికుంట, పెద్దాపూర్, తేలుకుంట తదితర గ్రామాల నుంచి 254 మంది పాఠకులకు ఇందులో సభ్యత్వం తీసుకున్నారు. ఈ గ్రంథాలయం 1986 నుంచి పాత కచేరి భవనంలో, 2014 నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో కొనసాగుతున్నది. ఒకే భవన సముదాయంలో సింగిల్ విండో, మండల వ్యవసాయ శాఖ, గ్రంథాలయం శాఖలు నిర్వహిస్తున్నారు. ఎరువులు, విత్తనాలు నిల్వ చేసుకోడానికి గోదాం సరిపోకపోవడంతో గ్రంథాలయంలోని ఒక గదిలో విత్తన బస్తాలు నిల్వ చేయాల్సి వచ్చింది. దీంతో పాఠకులకు రీడింగ్ రూమ్ లేక ఆరుబయట కూర్చోవల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతుంది. ఏండ్ల తరబడి సొంత భవనం నిర్మించడానికి ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడం శాపంగా మారుతుంది. విండోలోని గ్రంథాలయం శాఖ ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారనీ, అద్దె భవనం కోసం వెతుకుతున్నా అందుబాటులో లేవని గ్రంథపాలకుడు మౌళి తెలిపారు. ఐదేండ్ల క్రితం బీఆర్ఎస్ సర్కారు అన్ని వసతులు కల్పించి జూలపల్లిలో భవనం నిర్మించడానికి రూ. 25 లక్షల నిధులు మంజూరు చేసింది. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ స్వగ్రామంపై మమకారంతో పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించారు. 19 జూన్ 2018న అప్పటి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో కలిసి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పంచాయతీ పాలక వర్గం ఇక్కడ పక్కా భవనం నిర్మించడానికి రెండు గుంటల స్థలం కేటాయించడానికి అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టగా, పంచాయతీ స్థలంలో భవనం ఎలా నిర్మిస్తారని ఓ బీజేపీ మహిళా ప్రజాప్రతినిధి భర్త అడ్డుకున్నప్పటి నుంచి స్థల వివాదం కొలిక్కి రాలేదు. అప్పటి నుంచి భవన నిర్మాణం కలగానే మిగిలిపోయింది. చాలాసార్లు రెవెన్యూ అధికారులు సర్కారు దవాఖాన సమీపంలో, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్థలాలు పరిశీలించి తేల్చలేకపోయారు. ఎమ్మెల్యే విజయరమణారావు, జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పాఠకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భవనం వెంటనే నిర్మించాలి..

జూలపల్లిలో గ్రంథాలయ భవనం వెంటనే నిర్మించాలి. అద్దె భవనంలో సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నమ్. ఐదేండ్ల నుంచి నిధులున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు ప్రభుత్వం స్థలం కేటాయించి భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి. దాదాపు 4 దశాబ్దాల చరిత్ర కలిగిన గ్రంథాలయం నిర్లక్ష్యానికి గురవుతున్నది. గ్రంథాలయంలో విత్తన బస్తాలు నిల్వ చేశారు. రీడింగ్ రూమ్ ఇరుకుగా మారింది. పాలకులు, అధికారులు దృష్టిపెట్టాలి.

ఒడ్నాల ప్రసాద్, రీడర్, జూలపల్లి

నిధులున్నయ్..భవనం నిర్మిస్తాం..

సింగిల్ విండోలో ఉన్న గ్రంథాలయాన్ని ఖాళీ చేస్తాం. ప్రైవేట భవనం అద్దెకు తీసుకుంటాం. పాఠకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాము. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే జూలపల్లి మండల కేంద్రంలో గ్రంథాలయ పక్కా భవనం నిర్మిస్తాం. భవనం సముదాయ పనులకు రూ. 25 లక్షల నిధులు సిద్ధంగా ఉన్నయ్. ప్రభుత్వ స్థలం ఎంపిక చేసి అప్పగిస్తే పనులు మొదలు పెడుతాం.

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, ఏవీఎం రాజు, పెద్దపల్లి

31లోగా దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్, మే 26: ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఇంటర్‌లో 2024-25 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ గురుకుల సొసైటీ జిల్లా సమన్వయాధికారి జేజే ధెరిస్సా ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి నాన్ సీవోఈ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్ లో మిగిలిన సీట్ల భర్తీకి, 2023-24లో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 31 లోపు గురుకుల వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని ఆసక్తి కల్గిన విద్యార్థులు రూ.100 దరఖాస్తు రుసుముతో ఆన్‌లైన్‌లో ఈ నెల 31లోపు తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని ఎస్సీ గురుకుల సొసైటీ జిల్లా సమన్వయాధికారి పేర్కొన్నారు.

బీజేపీ కౌన్సిలర్ మృతి

శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

పెద్దపల్లి టౌన్, మే 26: పెద్దపల్లి మున్సిపల్ బీజేపీ పార్టీ, 4వ వార్డు కౌన్సిలర్ కొంతం శ్రీనివాస్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. గత కొద్ది రోజుల క్రితం వైష్ణోదేవి ఆలయాన్ని దర్శించుకొని తిరిగి రైల్లో వస్తుండగా ఢిల్లీ సమీపంలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి పట్టణంలో బీజేపీ పార్టీ పట్టిష్టతకు అలుపుఎరుగని కృషిచేశారు. హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో శివాలయం పూర్తిచేసి పట్టణ ప్రజల మన్ననలు పొందారు. రెండు పర్యాయాలు వార్డు సభ్యుడిగా, రెండు పర్యాయాలు కౌన్సిలర్‌గా గెలిచారు. శ్రీనివాస్‌రెడ్డి అకాల మరణంపై మాజీ ఎమ్మెల్యే గుజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడుగా ఎక్కువ కాలం పనిచేశారని, పార్టీ ఎదుగుదలకు, కార్యకర్తలకు అండగా పట్టణంలో క్రీయాశీలకంగా పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఆవేదన చెందారు. శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి సంతాపం తెలియజేయడంతో పాటు బీజేపీ పార్టీ అండగా ఉంటుందన్నారు. శ్రీనివాస్‌రెడ్డి మృతితో న్యూ హనుమాన్‌నగర్‌లో విషాదం నెలకొన్నది. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. శ్రీనివాస్‌రెడ్డి మృతి పట్ల సంతాపం తెలిపిన వారిలో వెలంపల్లి శ్రీనివాస్‌రావు, పిన్నింటి రాజు, శిరాలపు పర్వతాలు, తంగెడ రాజేశ్వర్‌రావు, జంగ చక్రధర్ రెడ్డి, బెజ్జంకి నరేశ్, బొంకూరి సురేందర్, దాడి సంతోష్, స్నేహితులు, అభిమానులు ఉన్నారు.

పెద్దపల్లి : సమ్మేళనంలో శాతవాహన సెకండరీ పాఠశాల 2001-02 బ్యాచ్ విద్యార్థులు



ధర్మారం: సమ్మేళనంలో ప్రతిభ అధ్యయన కేంద్రం 2007-08 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనాలు

పెద్దపల్లి/పెద్దపల్లి రూరల్/ధర్మారం/ఫర్టిలైజర్ సిటీ/ రామగిరి/పాలకుర్తి/ మే26: జిల్లాలోని పలు పాఠశాలల్లో ఆదివారం అపూర్వ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకున్నారు. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని సంతోషంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

పెద్దపల్లిలోని శాతవాహన సెకండరీ పాఠశాల 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సిరి ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల 2000-01 బ్యాచ్ విద్యా ర్థులు సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ధర్మారం మండలం కేంద్రంలోని ప్రతిభ అధ్యయన కేంద్రం ఉన్నత పాఠశాల 2007-08 బ్యాచ్ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రామగుండంలోని వాణి విద్యా విహార్ పాఠశాల 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్థానిక మేదరిబస్తీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. రామగిరి మండలం కల్వచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004 -2005 బ్యాచ్ పదో తరగతి విద్యా ర్థులు అదే పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో కలుసుకున్నారు.

ఫర్టిలైజర్ సిటీ : సమ్మేళనంలో వాణి విద్యావిహార్ 1998-99 బ్యాచ్ విద్యార్థులు

రామగిరి : కల్వచర్ల జడ్పీహెచ్ఎస్‌లో 2004 -05 బ్యాచ్ విద్యా ర్థుల సమ్మేళనం

పెద్దపల్లి రూరల్ : అప్పన్నపేటలో జడ్పీహెచ్ఎస్‌లో సమ్మేళనంలో 2000-01 బ్యాచ్ విద్యార్థులు

యువకుడి వేధింపులకు బాలిక ఆత్మహత్య

పాలకుర్తి, మే 26: యువకుడి వేధింపులతో బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల బీసీ కాలనీలో జరిగింది. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన బాలిక (16)ను పెద్దపల్లికి చెందిన శ్యాం అనే యువకుడు కొంత కాలంగా ప్రేమ పేరుతో వేధిస్తూ వెంటబడుతున్నాడు. ఎన్నిసార్లు వద్దని చెప్పినా పరిస్థితిలో ఏ మార్పురాకపోగా, ఇటీవలి కాలంలో మరింత ఎక్కువైంది. దీంతో బాలిక తీవ్ర మనస్తాపానికి లోనై ఆదివారం ఇంటో లేవరూ లేని సమయంలో ఊరేసుకున్నది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్యాంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

మల్లన్న ఆలయానికి పోటెత్తిన భక్త జనం

ఓదెల, మే 26: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రస్తుతం రైతులకు యాసంగి వ్యవసాయ పనులు ముగియడం, విద్యా సంస్థలకు సెలవుల రోజులు కావడంతో మల్లన్న ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం తెల్లవారుజాము వరకే ఆలయ ఆవరణ భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారిని ఇంటిల్లిపాది దర్శించుకుని పిల్లపాపలతో పాటు పాడి పంటలు సల్లంగా ఉండేలా చూడేలా మొక్కుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లను చేశారు.

రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగికి సన్మానం

గోదావరిఖని, మే 26: గోదావరిఖని ఆర్టీసీ ఉద్యోగి గీట్ల జితేందర్ ఉద్యోగ విరమణ సందర్భంగా పట్టణంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పని ఒత్తిడి లేకుండా పీఎఫ్, పీఆర్‌సీ అమలు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు కార్మికుల బకాయిలను చెల్లించాలని ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ ప్రధానకార్యదర్శి థామస్‌రెడ్డి కోరారు. ఇక్కడ నాయకులు నాగేందర్, బెంజిమేన్, కే మల్లేశం, జగన్మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఒలింపియాడ్‌లో ర్యాంకుల పంట

జ్యోతినగర్, మే 26: జాతీయ ఒలింపియాడ్ పరీక్షలో ఎన్టీపీసీ లోని విశ్వభారతి హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు అత్యంత ప్రతిభకనబరిచి జాతీయ, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఈ మేరకు ఆదివారం పరీక్షల కన్వీనర్ అరుకాల రామచంద్రారెడ్డి ర్యాంకులను విడుదల చేసి విజేతలను అభినందించారు. గత ఫిబ్రవరిలో జరిగిన సెమ్స్ ఒలంపియాడ్ పరీక్షలో లెవెల్1, 2 పరీక్షలో పాఠశాలకు చెందిన 8వ తరగతికి చెందిన జె వెంకట నారాయణ జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించగా, 9వ తరగతి విద్యార్థి ఈ రాజ్‌కుమార్ కూడ జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో యాంసాని వివేశ్ 1వ ర్యాంకు సాధించగా పీ నిక్షిప్త 5వ ర్యాంకు, సమీక్ష సర్కార్ 8వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్, హెచ్ఎం తిరుపతిగౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ ర్యాంకుల సాధించిన విజేత విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను అభినందించారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న మిత్రులు

సుల్తానాబాద్ రూరల్, మే 26: చిన్ననాటి మిత్రుడు రోడ్డు ప్రమాదంలో చనిపోగా సహచర మిత్రులు తలా కొంత పోగు చేసిన మొత్తాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. నర్సయ్యపల్లికి చెందిన మద్దెల తిరుపతి ఇటీవల మృతి చెందాడు. పదో తరగతి స్నేహితులంతా స్పందించి పిల్లల రూ. 40,500 నగదును జమచేశారు. పిల్లల పేరు మీద ఫిక్స్‌డ్ చేసిన బాండును ఆదివారం మృతి చెందిన మిత్రుడి భార్య పిల్లలకు అందజేశారు. మిత్రడి కుటుంబానికి సహచర మిత్రులు చేసిన ఆర్థిక చేయూతకు పలువురు గ్రామ ప్రముఖులు వారిని అభినందించారు. కార్యక్రమంలో మిత్రులు కుందేళ్ల శ్రీనివాస్, ఈశ్వరోజు శ్రావణ్,దీకొండ సిద్దు, మూల శ్రీనివాస్, ఆవుల నరేశ్, సీహెచ్ సంతోష్, జెట్టి రమేశ్, పాల్గొనగా మిత్రుడి కుటుంబానికి ఆర్థికంగా సహాయం చేసిన ప్రతి ఒక్కరికి మిత్రలు కృతజ్ఞతలు తెలిపారు.

మరణంలోనూ మహోపకారం

నేత్రదాత కుటుంబ సభ్యుడిని సన్మానిస్తున్న నిర్వాహకులు

కమాన్ పూర్, మే 26 మండలంలోని జూలపల్లిలో నేత్రదాత పెరటి అచ్చమ్మ (అహల్యమ్మ) సంస్మరణ సభ ఆదివారం కమాన్ పూర్ లయన్స్ క్లబ్, సదాశయ ఫౌండేషన్ ఆధ్వరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించారు. నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం అందించారు. కార్యక్రమంలో కమాన్ పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సదాశయ ఫౌండేషన్ 8 వకాలనీ పట్టణ అధ్యక్షుడు అనంతరాములు, నాయకులు పెరటి రాజమహేందర్ రెడ్డి, అనంతరెడ్డి, విజేందర్ రెడ్డి, నాయకులు రాంరెడ్డి, బక్కీరెడ్డి, అహల్యమ్మ కుమారుడు రాజిరెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.నేత్ర కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ ,ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ,గౌరవ సలహాదారు నూక రమేష్ ,పెద్దపెల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలు వెల్ది కవితలు అభినందనలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి

నాగరాజు(ఫైల్)

ఫర్టిలైజర్‌సిటీ, మే 26: గోదావరిఖని జనగామ శివారులోని ఇసుక బంకర్ వద్ద శనివారం రాత్రి ఆగి ఉన్న టిప్పర్ లారీని ఢీకొని జవహర్ నగర్‌కు చెందిన జీడీకే 11ఏ ఇంక్లైన్‌కు చెందిన గని కార్మికుడు రాసపల్లి నాగరాజు(31) మృతి చెందాడు. గోదావరి ఖని టూటౌన్ సీఐ బీ రవీందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగరాజు రెండో షిఫ్ట్ విధులు ముగించుకొని రాత్రి తన బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఆగి ఉన్న టిప్పర్ లారీని వెనుకాల నుంచి బైక్ ఢీకొట్టడంతో తలకు తీవ్రంగా గాయపడి కిందపడి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడు రెండున్నరేళ్ల క్రితమే సింగరేణిలో ఉద్యోగిగా విధుల్లో చేరాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం గోదావరిఖని సింగరేణి ఏరియా దవాఖానకు తరలించారు. మృత దేహాన్ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి తండ్రి పోశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు నిర్లక్ష్యంగా టిప్పర్ లారీని రోడ్డుపై నిలిపిన లారీ డ్రైవర్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సింగరేణి నిర్లక్ష్యంతోనే కార్మికుల మృతి

సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంతోనే గత ఆరు నెలలుగా ఇదే మార్గంలో నలుగురు సింగరేణి కార్మికులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారని పాలకుర్తి జడ్పీటీసీ, బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి ఆరోపించారు. కార్మికుడు మృతితో రోడ్డులో వీధి లైట్లు వెలుగులోకి రావడంపై ఆమె సింగరేణి నిర్లక్ష్య వైఖరిపై ఆవేదన వ్యక్తం చెందారు. ఇక్కడ బీఎంఎస్ నాయకులు యాదగిరి సత్తయ్య, శ్యామ్ పటేల్, బీజేపీ నాయకులు కోమల మహేశ్, కొండపర్తి సంజీవ్ ఉన్నారు.

జేఈఈ (అడ్వాన్స్) ప్రవేశ పరీక్ష ప్రశాంతం

అభ్యర్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న ప్రిన్స్‌పాల్, సిబ్బంది

రామగిరి, మే 26 : దేశంలో ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, ఎన్ఐటీ విద్యాలయాల్లో ఇంజనీరింగ్ సీట్లకై నిర్వహించే జేఈఈ(అడ్వాన్స్) ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష ఆదివారం మంథని జేఎన్‌టీయూ కళాశా లలో ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్స్‌పాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రెండు సెషన్స్‌లో జరిగిన పరీక్షలో 106 మంది అభ్య ర్థులకు గాను 104 మంది హాజరైనట్లు తెలిపారు. ముందుగా అభ్యర్థుల హాల్ టికెట్లతోపాటు వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత హాల్‌లోకి అనుమతినిచ్చినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కొప్పుల ఈశ్వర్

ధర్మారం,మే26: మండలంలోని రామయ్యపల్లి గ్రామంలో పలు బాధిత కుటుంబాలను ఆదివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు.బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మార్క బాలయ్య రోడ్డు ప్రమాదంలో గాయ పడగా అతని ఇంటికి వెళ్లి ఈశ్వర్ పరామర్శించారు.అదే గ్రామానికి చెందిన మండల మల్లయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా అతని ఇంటికి వెళ్లి ఈశ్వర్ పరామార్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ ఈశ్వర్ వెంట ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి,దొంగతుర్తి ఎంపీటీసీ దాడి సదయ్య,పార్టి సీనియర్ నేత పూస్కూరు జితేందర్‌రావు, నాయకులు మూల మల్లేశం,చింతల తిరుపతి ఉన్నారు.